


# ఆశ

"ఏమండీ మన టెనెంట్‌తో మాట్లాడారా?"

నారాయణ ఆఫీసునుంచి వచ్చీరాగానే అడిగింది సత్యవతి.

"ఏం మాట్లాడాలి?" విసుగ్గా అన్నాడు నారాయణ.

సత్యవతి ధోరణి అతనికి చిరాగ్గా ఉంటుంది. ఆఫీసు నుంచి వచ్చీరాగానే ఏదొక సమస్య ఎత్తి సతాయిస్తుంది.

కాస్త స్థిమితపడనివ్వదు. డ్రెస్ మార్చుకుని స్నానం చేసి కాఫీ తాగిన తర్వాత నెమ్మదిగా ఏదైనా ప్రస్తావిస్తే ఎంత బాగుంటుంది?

కానీ ఎన్నిసార్లు చెప్పినా తనకి అది అర్థంకాదు. తన ధోరణి తనదే.

"అయ్యో రామా! మన ఇంటి అద్దె పెంచడం గురించి మాట్లాడమన్నానుగా!" అంది సత్యవతి.

"నీకేం నువ్వు చెప్తావు? అద్దె పెంచి ఆర్నెల్లు కాలేదు. ఇప్పుడు వెళ్ళి అద్దె పెంచండీ అని అడిగితే ఏం బాగుంటుంది? మన గురించి ఏమనుకుంటారు? పీడిస్తున్నాడురా ఇంటి ఓనర్ అనుకోడూ?" అన్నాడు నారాయణ.

"వాళ్ళేం అనుకుంటే మనకేంటి? కూకట్‌పల్లి, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ మాదిరిగా మారిపోతున్నదట. హైటెక్‌సిటీకి షార్ట్‌కట్ రోడ్ పడిందట. అక్కడ పనిచేసేవాళ్లకి నలభైవేలు, యాభై వేలు జీతాలట. వాళ్లంతా అద్దెల కోసం ఎగబడుతున్నారట. డబుల్ బెడ్‌రూం ఫ్లాట్‌కి ఏడువేలు అద్దె ఇస్తున్నారట. మన పక్కింటి పద్మ చెప్పిందండీ!" సత్యవతి చెప్పుకుపోతోంది.

"సర్లేవే! అద్దె పెంచే విషయం మరొక ఆర్నెల్లు తర్వాత ఎత్తుదాం. ఇప్పుడు బాగుండదు. ఆర్నెల్ల క్రితమే ఐదొందలు పెంచాం. ఐనా మన టెనెంట్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కాదుగా ఏడువేలు, పదివేలు అద్దె ఇవ్వడానికి" అన్నాడు నారాయణ.

"ఎంత పెంచినా మనకి ఇస్తున్నది మూడువేలేగా? అంతగా ఇవ్వలేకపోతే ఖాళీ చేస్తాడు" అని గొణుక్కుంటూ పోయింది సత్యవతి.

'దీని ఆశ పాడుగాను. దీనికంతా వాళ్ల నాన్న పోలికలే వచ్చి చచ్చాయి' అనుకున్నాడు నారాయణ.

* * *

నారాయణ ఆఫీసుకి వెళ్లిన తర్వాత సత్యవతి కూకట్‌పల్లికి బయల్దేరివెళ్లింది.

కూకట్‌పల్లి చాలా మారిపోయిందనీ, అన్ని కార్పొరేట్ స్కూళ్ళు, కాలేజీలు వచ్చేశాయనీ, ప్రముఖ కంపెనీల షోరూమ్స్ వెలిశాయనీ అన్నిటికి ఇక్కడ సౌకర్యంగా ఉంటుందని తామే ఇక్కడికి వచ్చి ఉండాలనుకుంటున్నామనీ, వీలైనంత త్వరలో ఫ్లాట్ ఖాళీ చెయ్యమనీ చెప్పింది అద్దెకున్నవాళ్లకి. టెనెంట్ ఇల్లాలు ఉస్సూరుమంటూ తల ఊపింది.

* * *

నెల తర్వాత టెనెంట్ నారాయణకు ఫోన్ చేశాడు.

"సార్! మీ ఫ్లాట్ ఖాళీచేశాను. కీ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌కి ఇచ్చాను" అన్నాడు.

"ఏంటి ఇంత సడెన్‌గా! మీకు ట్రాన్స్‌ఫర్ ఏమైనా అయిందా?" అన్నాడు నారాయణ.

"లేదండీ. మీరే ఇక్కడికి వస్తున్నారటగా. మీ మిసెస్ వచ్చి ఖాళీ చెయ్యమని చెప్పారట. మీకు తెలీదా?" అన్నాడు టెనెంట్.

నారాయణ మాట్లాడలేదు. అద్దె పెంచమని చెప్పకుండా ఖాళీచెయ్యమని చెప్పిందన్నమాట అనుకున్నాడు పళ్ళునూరుకుంటూ.

ఇంటికొచ్చిన తర్వాత భార్య మీద మండిపడ్డాడు. మొగుడి కోపం తాటాకు మంటలాంటిదేనని తెలిసిన సత్యవతి ఏం మాట్లాడలేదు.

"డబ్బెవరికి చేదు? చూస్తుండండి నెలకి ఏడు వేలు ఇచ్చేవాళ్ళొస్తారు. ఐనా మీకేం బాధ? ఆ పోయినవాళ్ళు మీకు చుట్టాలా?" అంది.

సత్యవతి మర్నాడే కూకట్‌పల్లి వెళ్లి తమ ఫ్లాట్‌కి టూలెట్ బోర్డు పెట్టి వచ్చింది.

* * *

భార్య మీద అలిగిన నారాయణ ఇక ఏమీ పట్టించుకోలేదు. ఫ్లాట్ అద్దెకు కావాలని వచ్చే ఫోన్లన్నీ సత్యవతే రిసీవ్ చేసుకుంటోంది. ఆఖరికి రమేష్ భాటియా అనే కుర్రాడు ఎనిమిదివేలు ఆఫర్ చేశాడు.

తాను హైటెక్‌సిటీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌నని, తన భార్య బొంబాయిలో ఉందనీ త్వరలో ఇక్కడికి వస్తుదనీ చెప్పాడు. మూడునెలల అద్దె అడ్వాన్స్‌గా ఇచ్చాడు.

సత్యవతి సంతోషానికి పట్టాపగ్గాల్లేవు.

ఆర్నెల్లు గడిచాయి. నెలనెలా సత్యవతే వెళ్లి అద్దె వసూలుచేసుకుని వస్తోంది. రమేష్ భాటియా భార్యని తీసుకురాలేదు. ఒంటరిగానే ఉంటున్నాడు. ఆ ఫ్లాట్‌కి ఎవరెవరో వస్తున్నారనీ, రాత్రిళ్ళు తాగి తందనాలాడతారనీ వాచ్‌మెన్ చెప్పాడు.

సత్యవతి అవన్నీ పట్టించుకోలేదు.

ఒకరోజు రాత్రి అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సెక్రటరీ ఫోన్ చేశాడు.

"నారాయణగారూ! మీ ఫ్లాట్‌లో బాంబు పేలింది. అందులో ఉన్న ఇద్దరు చచ్చిపోయారు. పోలీసులొచ్చారు. వాళ్ళు ఫ్యాక్షనిస్టుల తాలూకా నట. వాళ్ళు ఎవరు? ఏ ఊరు వాళ్ళు? ఫ్లాట్ ఓనర్ ఎవరు? అని అడుగుతున్నారు. మీరు వెంటనే రావాలి"

నారాయణ నెత్తిన బాంబు పడినవాడిలా వణికిపోయాడు. జరిగింది విని సత్యవతి అదిరిపడింది. తర్వాత పోలీసుకేసుల నుంచి బైటపడడానికి, లాయర్ ఫీజులకి ఆ ఫ్లాట్ అమ్మేసుకోవాల్సి వచ్చింది.

★